# ట్విస్ట్ లేని కథ



వర్షాలు పడక రైతులంతా గోల పెడు తున్న రోజుల్లో అకస్మాత్తుగా జల్లు కురిసింది. నరిసిగాడికదిచికాకనిపించింది. "వర్షం కొంచెం తగ్గితే బావుణ్ణు" గొణి గాడు

"పిడకలు ఎండిపోతే అవి అమ్మేస్తే రాత్రికి కాస్తయినా గంజినీళ్ళు కాయొచ్చు" నరిసిగాడి పెళ్ళాం

ఆ స్వార్థం వెనక ఆకలి మంటలు రాజు కుంటున్నాయి.

అటు దేశపు సరిహద్దుల్లో యుద్ధ సన్నా హాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

"బియ్యం పది లారీలు వైజాగ్‌నించి ఇమీడియట్‌గా అనకాపల్లి పంపు...."

టెలిఫోన్‌లో వరహాల్రాజు.

"మీ అయిడియా అర్థం కాలేదండీ." శ్రీమతి వరహాల్రాజు

"అవతల యుద్ధం ఆరంభమయేట్లుంది. అనకాపల్లి మన సీక్రెట్ గోడవున్స్‌లోకి తోసేస్తే భగవంతుని దయవల్ల యుద్ధం ఆరంభమైతే అవి బియ్యంకాదు. బంగారు ముక్కలు...."

ఆ స్వార్థం వెనక ధనపిశాచి పుంజు కుంటున్నది.

తర్వాత కొన్ని సంవత్సరాలు దొర్లి పోయేయి.

పిడకలు బంగారు ముక్కలయ్యేయి. బంగారు ముక్కలు పిడకలయ్యేయి.

బంగారు ముక్కల వ్యాపారి నరసా రావు. నరిసిగాడి పెళ్ళాం శ్రీమతి నరసా రావు

పిడకల వ్యాపారి వరంగాడు వరహా ల్రాజు. శ్రీమతి వరంగాడి పెళ్ళాం. మనుషులెవరైతేనేం మళ్ళీ కథ మామూలే!

గుడిమెట్ల గోపాలకృష్ణ



# సభ్యత కోసం

నేను ఆ రోజు విజయనగరం వెళదామని బయలుదేరాను. ఆదివారం కావడం వలన బస్సు రద్దీగా ఉంటుందని అరగంట ముందుగా బస్సుస్టాండు చేరుకున్నాను. శ్రీకాకుళం— విజయనగరం బస్సు అప్ప టికే స్టాండులో ఉంది. ఎలాగైతేనేమి కూర్చొనటానికి సీటు దొరికింది. ఇంచు మించు బస్సు అంతా ఫుల్ అయింది. కొంతమంది నిలుచొని ఉన్నారుకూడా.

అంతలోనే ఒక అమ్మాయి మెరుపు తీగెలా బస్సులోకి ప్రవేశించింది. తెల్లని చీర, ఎరుపు, పసుపు కలయికల బోర్డరు చీర ధరించి, మెడలో రెండు పేటల ముత్యాల గొలుసు, చేతులకు ముత్యాల గాజులు తప్ప ఇంకే రకములైన ఆభరణ ములు లేకుండా చిన్నబొట్టుతో సింపుల్‌గా ఉంది.

బయట ఎండగా ఉండటం వలన మొహం అంతా కంది ఎర్రగా తయా రయింది. బస్సు ఎక్కగానే చేతిలో వున్న బ్రీఫ్ కేసు క్రిందపెట్టి జాగా కోసంఅటూ, ఇటూ చూసి 'ఇక తప్పదు' అన్నట్లు రాడ్ పట్టుకుని నిల్చొంది. అంత అందమైన ఆ అమ్మాయి నిల్చోవడం చూసి నాకు ఎట్లానో అనిపించింది. వెంటనే నేను నా సీటులోంచి లేచి నిలబడి కర్టెసీ కోసం ఆ అమ్మాయికి ఆఫర్ చేశాను. ఆ అమ్మాయి కాస్త ఆలోచించి కూర్చొంటూ 'థాంక్స్' అని చిరునవ్వుతో చెప్పింది.

మెల్లగా ఆ అమ్మాయితో మాటలు కలి పాను. ఇంక ఫర్వాలేదు అనిపించింది. ఈ అమ్మాయితో హాయిగా కాలక్షేపం అవుతుంది. హాయిగా నిల్చొని గమ్యం చేరవచ్చు అనిపించింది.

బస్సు బయలుదేరే సమయం కావ చ్చింది ఇంకా రెండు మూడు నిముష ములు మాత్రమే వుంది ఇంతలో కండ క్టరు వచ్చి "అయ్యా! స్టాండింగ్ ప్యాసింజర్స్ దిగిపోవాలి. నెక్స్ట్ స్టాప్‌లో బ్రేక్ ఇన్‌స్పెక్టరు చెకింగ్ వుందం"టూ ఒక్కొక్కరినే దింపడం మొదలు పెట్టాడు. ఇంక, నా పరిస్థితి!

.బి. జగదాంబ